ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 3 మే 2024



విజయనగరం సభకు హాజరైన జనం


విజయ నగరంలో టీడీపీ అభిమానుల కేరింత

స్వర్ణాంధ్ర సహకార యాత్రలో భాగంగా గురువారం విజయనగరం వచ్చిన సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విజయనగరం వాసులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. చీపురుపల్లిలో సభ ముగించుకుని ఆయన విజయనగరం వచ్చినప్పుడు నగరంలోని రాజారావు మేడ జంక్షన్ (సౌత్ ఇండియా షాపింగ్ మాల్) వద్ద పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలకడమే కాకుండా ఆయనపై పూలవర్షం కురిపించారు. టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అక్కడి నుంచి బాలకృష్ణతో పాటు రోడ్ షోలో పాల్గొన్నారు. అడుగడుగునా ప్రజలు ఆదరణతో కస్పల మార్కెట్ వరకూ రోడ్ షో కొనసాగింది. రోడ్‌షో ముందు బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులు కాగిత శ్రీనివాస్, కనకల మన్మధల ఆధ్వర్యంలో నందమూరి అభిమానులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జై బాలయ్య అంటూ నినాదాలతో విజయనగరం హోరెత్తింది.


చీపురుపల్లిలో బాలకృష్ణ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న మహిళలు

అప్పిచ్చి.. ఆస్తులు లాగేస్తారు

- కోలగట్లను ఉద్దేశించి బాలకృష్ణ పరోక్ష విమర్శ
- ఉత్తరాంధ్రకు బొత్స, ధర్మాన చేసిందేమిటని ప్రశ్న

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్, మే 2: అడుక్కునే వాడి నుంచి.. చిరు వ్యాపారి వరకూ.. అందరికీ అప్పులిచ్చి ఆస్తులను లాక్కోవడం ఎమ్మెల్యే కోలగట్ల నైజమని సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. విజయనగరంలోని గంటస్తంభం వద్ద స్వర్ణాంధ్ర సహకార యాత్ర పేరిట గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. అప్పు, తాకట్టు, వడ్డీ, కబ్జాలతో దోచుకుంటున్నారని కోలగట్లపై విరుచుకుపడ్డారు. పేకాట, మద్యం, అశ్లీల నృత్యాలు తదితర వాటిని కూడా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లు, థియేటర్లపై పడి దందాలు చేసి వసూలు చేస్తున్నారన్నారు. బొత్స, ధర్మాన, తమ్మినేని, అవంతి, గుడివాడ అమర్ తదితర కుటుంబాలు 35 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. సొంత అభివృద్ధి మినహా, రోడ్లపై వున్న గోతుల్లో మట్టి అయినా పోశారా? అని ప్రశ్నించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, రహదారులు ఏవీ అభివృద్ధి చేయలేదన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును, మన భవిష్యత్ తరాల రాతను మార్చేవని చెప్పారు. సరైన అభ్యర్థులకు ఓటేయాలన్నారు. జగన్ మళ్లీ వస్తే రాష్ట్రాన్ని విడిచిపెట్టి పోయే పరిస్థితి వస్తుందన్నారు. అవ్వతాతలకు అందించే పెన్షన్‌ల విషయంలో ఇబ్బందులకు గురిచేసి నోటి దగ్గరి కూడును లాగేస్తున్నారన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే మరింత అరాచకమేనన్నారు. అశోక్ గజపతిరాజు రాజకీయాల్లో సుదీర్ఘంగా ఉన్నారని, ఎన్నో పదవులు అలంకరించారని, ఏనాడూ నీతినిజాయితీలను వీడలేదన్నారు.



ప్రతి తలపైనా రూ.10 లక్షల రుణ భారం: బాలకృష్ణ

చీపురుపల్లి, మే 2: రాష్ట్రంలోని వైసీపీ పాలన పుణ్యమా అని ప్రతిఒక్కరూ తమ తలపై పది లక్షల రూపాయలకు పైగా రుణ భారం మోస్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ చలవతోనే ఈ భారం పడిందన్నారు. దీనినుంచి విముక్తి పొందాలన్నా, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్నా వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటేయాలని ఆయన కోరారు. చీపురుపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు షోలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత దివంగత ఎన్టీఆర్‌దే అన్నారు. ఆయన వారసునిగా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు గతంలో అమలు చేశారని, జీరో బడ్జెట్‌లో కూడా పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం రుణాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. ప్రతి వ్యక్తి తలపై పది లక్షల రుణం ఉందన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు జరగలేదని, విదేశీ విద్య పథకం అమలు కావడం లేదని, ఈ ప్రాంతంలోని రైతులకు తోటపల్లి ప్రాజక్టు ద్వారా సాగు నీరు అందడం లేదని సమస్యలను ప్రస్తావించారు. చీపురుపల్లి పరిసర ప్రాంతాలకు విద్యుత్‌ను అందించే ఆర్ఈసీఎస్‌ను మూసివేశారన్నారు. ఆ సంస్థలో ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రాంతంలో జరిగే ప్రతి పనికీ పాలకులకు వాటా ఇవ్వవలసిందేనన్నారు. ఇటువంటి నాయకుల్ని ఇంటికి పంపించాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఉత్తమ పాలన కోసం కూటమి అభ్యర్థులుగా ఉన్న కిమిడి కళావెంకటరావును ఎమ్మెల్యేగా, కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. సభలో కూటమి అభ్యర్థులు కిమిడి కళావెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు, కిమిడి నాగార్జున, గద్దే బాబూరావు, త్రిమూర్తులరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తవలసలో బాలకృష్ణ ఎన్నికల సభ...

శృంగవరపుకోట, మే 2: శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం సాయంత్రం 5గంటలకు సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూటమి తరుపున ఎన్నికల సభ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి గురువారం తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ పాపం సర్కారుదే

- బ్యాంకు అకౌంట్‌లో పింఛను వేస్తే ఎలా?
- సర్వీసుల పేరుతో కట్ చేస్తున్నారు..
- మండుటెండలో వెళ్లి క్యూలో నిల్చున్నాము
- బ్యాంకు సిబ్బంది జిరాక్స్‌లు అడుగుతున్నారు
- గోడు వెళ్లబోసుకున్న పింఛన్‌దారులు

'గత నెల సచివాలయాల్లో పింఛను తీసుకున్నాం. ఈసారి అలా ఎందుకు ఇవ్వలేదు. మమ్మల్ని ఇబ్బంది పెట్టడానికే సర్కారు పింఛన్ డబ్బులను బ్యాంకు ఖాతాలో వేసింది. ఎండలో అలసిసొలసి వెళ్తే బ్యాంకు సిబ్బంది జిరాక్స్ కాపీల కోసం పదేపదే తిప్పారు. అంతా అయ్యాక సర్వీసు చార్జీల కోసం కొంత డబ్బులకు కోత పెట్టారు. పింఛనే ఆధారంగా బతుకుతున్న మేము ఈ నెల ఎలా నెట్టుకొచ్చేది' అంటూ వృద్ధులు 'ఆంధ్రజ్యోతి' వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. దాదాపు జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ఎవరిని కదిపినా కన్నీరుపెడుతూ తమ కష్టాలను విన్నవించారు. ప్రభుత్వం పింఛన్ డబ్బులను ఈసారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వాటిని తీసుకునేందుకు వృద్ధులు నరకం చూస్తున్నారు. మండుటెండల్లో బ్యాంకులకు బయలుదేరుతున్నారు. తీరా అక్కడకు వెళ్లాక మరిన్ని కష్టాలు పడుతున్నారు. ఖాతాలో డబ్బులు పడలేదని.. బయోమెట్రిక్ పడడం లేదని... సర్వర్ పనిచేయడం లేదని, విత్‌డ్రా ఫాం సరిగా నింపలేదని ఇలా వివిధ రూపాల్లో గురువారం అవస్థలు పడ్డారు.



గంట్యాడ: కొటారుబిల్లి కూడలిలో బీసీ పాయింట్ వద్ద వృద్ధుల నిరీక్షణ

భోగాపురం/ గజపతినగరం/ శృంగవరపుకోట/రేగిడి/ గంట్యాడ/ బొబ్బిలి/ రామభద్రపురం, మే 2: జిల్లాలో గురువారం ఏ బ్యాంకు వద్ద చూసినా పింఛనుదారుల అవస్థలే కనిపించాయి. బారులుతీరిన క్యూలు.. నిల్చోలేక ఉన్నచోటే నిరీక్షించిన వృద్ధులు.. విత్‌డ్రాఫాం నింపలేక వారిని వీరిని ప్రాధేయపడడం.. సర్వీసుల పేరుతో డబ్బులకు కోత పడిన వారు ఆవేదనతో తిరుగుముఖం పడడం తదితర దృశ్యాలు ప్రస్ఫుటమయ్యాయి. పింఛన్ లబ్ధిదారులు ఎండను భరిస్తూ బ్యాంకులకు క్యూ కట్టారు. అక్కడికి వెళ్లాక ఒక్కొక్కరికీ ఒక్కో విధమైన చేదు అనుభవం ఎదురైంది. ఖాతా రన్నింగులో లేదని, కేవైసీ చేయించుకోవాలని, ఆధార్ లింకు కాలేదని, ఆధార్‌కు వేరే బ్యాంకుఖాతా లింకై ఉందని... బ్యాంకుల సిబ్బంది చెప్పడంతో పింఛన్‌దారులు ఇదెక్కడి అన్యాయమంటూ గగ్గోలుపెట్టారు. ప్రభుత్వం ఈ విధంగా ఇబ్బంది పెట్టడం బాగాలేదని వారంతా నిట్టూర్చారు. కొంతమంది పెన్షన్‌దారులకు చేతికి పైసా అందకుండా మొత్తం నగదు బాంకులోనే కట్ అయిపోతోంది. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా ఏటీఎం చార్జీలు, ఎస్ఎంఎస్ చార్జీలు, మెంటైనెన్స్, ఇతరత్రా చార్జీలు తమ ప్రమేయం లేకుండా కట్ అయిపోతాయన్నారు. ఈ ప్రక్రియ బ్యాంకు నిబంధనల ప్రకారమే జరుగుతోందని సమాధానం ఇవ్వడంతో పాపం పింఛనుదారులు చేసేదిలేక నిరాశతో ఇంటిబాట పట్టారు.

ప్రతిపక్షంపై నెడుతున్న వైసీపీ

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం లబ్ధిపొందేందుకు హింసిస్తోందని వృద్ధులు మండిపడుతున్నారు. తెలుగుదేశం పార్టీపై వ్యతిరేకత కల్పించే బుద్ధితో ఇలా చేస్తోందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే వైసీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాల్లో ఈ అంశాన్ని మాట్లాడుతున్నారు. ఇంటింటికీ పింఛన్‌లను పంపిణీ చేయకుండా వలంటీర్లను టీడీపీ అడ్డుకుందంటున్నారు. అయితే వైసీపీ ప్రలోభాన్ని కనిపెట్టిన ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకొని వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ వద్దని ఆదేశించింది. ఇదే అవకాశంగా వైసీపీ ప్రభుత్వం పింఛన్‌దారులను అవస్థలకు గురిచేస్తున్నారు. ఈ నెపాన్ని ప్రతిపక్షంపై నెడుతున్నారు.



పింఛన్ కోసం వచ్చి.. సొమ్మసిల్లి

తెర్లాం మండలం చీకటిపేట గ్రామానికి చెందిన మర్రి దానయ్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి రాజాం యూనియాన్ బ్యాంకుకు వచ్చాడు. అతని బ్యాంకు ఖాతా చెల్లుబాటు కాదని సిబ్బంది చెప్పడంతో చేసేదిలేక భార్యను వెంటబెట్టుకొని తిరిగి బయలుదేరాడు. అయితే అప్పటికే వడదెబ్బ తగలడంతో దానయ్య బ్యాంకు ఆవరణలో సొమ్మసిల్లి పడిపోయాడు. దివ్యాంగుడైన ఈయన బ్యాంకు వద్దకు రావడానికి ఎంతో కష్టపడ్డాడు. అయినా ఫలితం దక్కలేదు.

- రాజాం/ రూరల్

డబ్బులన్నీ తీసుకున్నారు..



బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతా ఉంది. దాంట్లో జమ అయిన పింఛను తెచ్చుకోవాలని బ్యాంకుకు వెళ్లాను. విత్‌డ్రా ఫాం రాసి ఇవ్వగా ఖాతాలో బ్యాలెన్స్ లేదని బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఎందుకని ప్రశ్నించగా ఏటీఎం, ఎస్ఎం ఎస్, మెంటైనెన్స్ చార్జీలు ఖాతా నుంచి కటింగ్ అయి ఉండొచ్చునన్నారు. చేసేదిలేక వెనుతిరిగాను. పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నాను. ఈనెల ఇబ్బందులు పడాల్సిందేనా. ప్రభుత్వం ఇలా చేయడం చాలా అన్యాయం.

- పి.కుమారి, పింఛన్ లబ్ధిదారు, భోగాపురం.

పుస్తకం పనిచేయదట



నా బ్యాంక్ పుస్తకం మార్చాలని.. పింఛన్ పడలేదని చెప్పారు. దత్తిరాజేరు మండలం నుంచి ఆటో కట్టించుకొని వచ్చాను. ఆధార్ కార్డు, ఫొటో పట్టుకొని రేపు రమ్మంటున్నారు. ఇలా బ్యాంక్‌కు రోజూ తిరగాలంటే కష్టంగా ఉంది. ఎండలు మండిపోతున్నాయి.

- చుక్క రామునాయుడు, చినకాద, గజపతినగరం



ఈ బ్యాంక్ కాదంటున్నారు

జిన్నాం గ్రామం నుంచి కె.యస్ఆర్ పురంలోని బ్యాంక్‌కు వచ్చాను. పింఛను ఇక్కడ కాదు జిన్నాం వెళ్లి అక్కడున్న బ్యాంక్‌లో తీసుకోవాలని చెప్పారు. అక్కడ అడిగితే కెయస్ఆర్ పురం వెళ్లాలని చెప్పారు. ఇంతకీ నాకు పింఛన్ ఎక్కడ ఇస్తారో అధికారులు స్పష్టంగా చెప్పడం లేదు.

- మిత్తిరెడ్డి అప్పయ్యమ్మ, జిన్నాం

ఇదెక్కడి చిక్కు

నాకు స్టేట్‌బ్యాంకులో డబ్బులు వేసారని తెలిసి ఉదయమే వచ్చాను. మధ్యాహ్నం అయినా ఇంతవరకు నా డబ్బులు ఇవ్వలేదు. అడిగితే మిషన్ పోయిందని, అందుకే ఆలస్యం అవుతోందని చెబుతున్నారు. ఇదెక్కడి చిక్కు వచ్చింది.

- రాములమ్మ, కంచరవీధి, బొబ్బిలి



పోస్టల్ బ్యాలెట్ స్వీకరణకు కేంద్రాలు

కలెక్టరేట్, మే 2: జిల్లాలో ఓటు హక్కు ఉండి ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు ఇప్పటికే ఫారం 12 సమర్పించిన వారికి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాజాం నియోజకవర్గానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా), బొబ్బిలికి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాల (గొల్లపల్లి), చీపురుపల్లికి శ్రీరాం జూనియర్ కాలేజీ(గరివిడి), గజపతినగరానికి ప్రభుత్వ బాలికల పాఠశాల(పురిటిపెంట), నెల్లిమర్లకు సీకేఎం ప్రభుత్వ జూనియర్ కాలేజీ, విజయనగరానికి జేఎన్‌టీయూ, ఎస్.కోటకు ప్రభుత్వ బాలురు పాఠశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీఎం వచ్చి వెళ్లినా అవస్థలే

- రెండు రాత్రులు నిద్రలేదంటున్న బొబ్బిలి వాసులు
- విద్యుత్ సరఫరా లేని కారణంగా ఇబ్బందులు



సీఎం వచ్చారని కరెంటు తీశారట

నారాయణరావు, ఎలక్ట్రికల్ మెకానిక్, బొబ్బిలి

సీఎం జగన్ వచ్చారని రెండు రోజుల పాటు కరెంటు లేకుండా పోయింది. ఈ రెండు రోజులు ఏ పనీ చేయలేకపోయాం. కరెంటు ఉంటేనే మాకు పని.

బొబ్బిలి, మే 2: బొబ్బిలి పట్టణంలో బుధవారం సీఎం జగన్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన నేపథ్యంలో వరుసగా రెండు రాత్రులు స్థానికులు నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరాను నిలిపివేయడమే ఈ పరిస్థితికి కారణం. సీఎం పర్యటనకు ముందురోజు తీసేసిన కరెంటు సరఫరాను ఆయన వెళ్లిపోయిన మరుసటి రోజు మధ్యాహ్నం వరకు పునరుద్ధరించలేదు. పట్టణంలోని చాలా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. విపరీతమైన ఎండలు కాస్తున్న నేపథ్యంలో భరించలేని ఉష్ణోగ్రతలతో చెమట్లు కక్కుతూ నరకయాతన పడ్డారు. ఇంట్లో నిద్రిస్తే ఈ సమస్య, ఆరుబయట పడుకుందామంటే దోమల బెడద అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాత్రుతులు కంటిమీద కునుకులేకుండా గడిపామని పలువురు 'ఆంధ్రజ్యోతి వద్ద వాపోయారు. విద్యుత్ కార్యాలయాలకు వినియోగదారుల నుంచి విపరీతంగా ఫోన్‌కాల్స్ వస్తుండడంతో వారు సమాధానం చెప్పలేకపోయారు. విద్యుత్ సరఫరాకు ఏర్పడ్డ అంతరాయాన్ని సరిచేస్తున్నామనేవారు. నాయుడుకాలనీ, రాజాకళాశాల, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలకు బుధవారం రాత్రంతా కరెంటు సరఫరా లేదు. గురువారం వినియోగదారులు గగ్గోలు పెడితే మధ్యాహ్నం కల్లా పునరుద్ధరించగలిగారు.

రెండు రాత్రులు ఇబ్బందులు పడ్డాం

అల్లు సంగమ్మ, నాయుడుకాలనీ, బొబ్బిలి

బుధ, గురువారాలలో రెండు రాత్రులు కరెంటు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాము. నిద్రపట్టలేదు. దోమలు తినేసాయి. అట్టముక్క పట్టుకొని ఇసురు కొంటూ ఉన్నాము.



సాంకేతిక సమస్యలే

అనంతరావు, విద్యుత్‌శాఖ ఈఈ, బొబ్బిలి

బొబ్బిలి విద్యుత్ డివిజన్ పరిధిలో రోజువారీ 177 నుంచి 180 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అందుకు తగినట్టుగా విద్యుత్ సప్లయి ఉంది కాని కోత లేదు. సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని ఇబ్బందులు తప్పలేదు. ఒకేసారి ఏసీలు, ఫ్రిజ్‌లు, నీటి మోటార్లను వినియోగిస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఫీజులు కొట్టేస్తున్నాయి.

పీపుల్స్ మేనిఫెస్టో

రామ మందిరాలకు ఉచిత విద్యుత్ అందించాలి



సాలూరు రూరల్: రామమందిరాలకు, దేవాలయాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించాలి. రామమందిరాలు, దేవాలయాలకు ఇళ్ల కంటే అధిక విద్యుత్ చార్జీలు వసూలు చేస్తుండడం దారుణం. ఆధ్యాత్మిక ప్రదేశాలు కాబట్టి వాటికి ఉచిత విద్యుత్‌ను ప్రకటించాలి. వివాహాలు, శుభకార్యాల కోసం నిర్మించిన ధర్మశాలలకు మున్సిపల్ ఆస్తి పన్ను నుంచి మినహాయించాలి. కమ్యూనిటీ సహకారంతో అందరికి వినియోగపడే వాటిపై ఆస్తి పన్ను భారం మోపడం సరికాదు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించవలసిన అవసరం ఉంది.

- గౌడు రమణ, సాలూరు

ఖైదీలకూ ఓటుహక్కు

మీకు తెలుసా

విజయనగరం: రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయులకు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాలతో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటుహక్కు ఉంటుందా.. ఉండదా అన్న ప్రశ్న చాలామందికి తలెత్తుంది. ఖైదీలు కూడా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రివెంటివ్ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని తెలియజేస్తూ... పోలింగ్ బూత్.. ఓటరు క్రమసంఖ్యతో ఓటువేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి.. ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

అప్పుడు ధర్మయుద్ధం... ఇప్పుడు ధనయుద్ధం

పెద్దల మాట

భామిని: అప్పట్లో ఎన్నికలంటే ధర్మయుద్ధంగా ఉండేవి. నాయకులు మాట ఇస్తే జవదాటేవారు కాదు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నాయకులు తీర్చేవారు. ఇప్పుడు ఎన్నికలు అడుగడుగునా ఎత్తుగడలు, ధన యుద్ధంగా మారాయి. ఓటర్లను, నాయకులను ప్రస్తుతం నమ్మే సితిలో లేరు. ఇప్పుడు ఓటరు హక్కులను యంత్రాలకు ఇవ్వడం వల్ల మాలాంటి వృద్ధులం ఎవరికి ఓటు వేస్తామో తెలియని పరిస్థితి నెలకొంది. నా ఓటు గుట్టుగా వేసేవాడిని. ఇప్పుడు యంత్రాలతో ఓటు వేయడం వల్ల ఎవరికి వేస్తున్నానో.. ఏ గుర్తుకు పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. గతంలో ఈ ప్రాంత గిరిజనులు మణిగ, కోటకొండ, బం ద్రసింగి, మూలగూడ తదితర గ్రామాల నుంచి సుమారు ఏడు కిలోమీటర్లు నడిచి వచ్చి ప్రశాంతంగా ఓటు వేసి వెళ్లేవారు. ఇప్పుడు వీధికొక నాయకుడు ఓటర్ల దగ్గరకు వచ్చి... ఈ గుర్తుకు వేయాలని.. ఆ గుర్తుకు వేయాలని ప్రచారం చేస్తున్నారు.

- గోరుచుట్టు బుచ్చి, భామిని



బాబాయ్.. అబ్బాయ్.. రెండు పార్టీలు

(రాజాం రూరల్)

ఉత్తరాంధ్రలో బాబాయ్.. అబ్బాయ్.. అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది కింజరాపు అచ్చెన్నాయుడు.. రామ్మోహన్ నాయుడే. ఈ ఇద్దరి జోడీ ప్రతి ఎన్నికల్లోనూ గెలుస్తూ వస్తున్నారు. వీరిలాగే రాజాంలోనూ మరో బాబాయ్.. అబ్బాయ్ ఉన్నారు. వారే కంబాల జోగులు.. కంబాల రాజవర్దన్. గత ఎన్నికలలో రాజాం నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన ఈ బాబాయ్.. అబ్బాయిలు ఈసారి వేర్వేరు నియోజకవర్గాల నుంచి.. వేర్వేరు పార్టీల తరపున పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికలలో రాజాం నియోజకవర్గం నుంచి కంబాల జోగులు వైసీపీ నుంచి పోటీ చేయగా.. అతని సోదరుడి కుమారుడు కంబాల రాజవర్దన్ జాతీయ కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. గడచిన అయిదేళ్లలో కంబాల జోగులు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించక పోవడం.. వ్యక్తిగత అభివృద్ధికే పెద్దపీట వేయడం, సాధారణ సమస్యలు సైతం పరిష్కరించలేకపోవడం... పట్టణంలో రెండో విడత విస్తరణకు సంబంధించి కేవలం రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణం పనులు కూడా పూర్తి చేయించలేకపోవడం వంటి కారణాల వల్ల రాజాంలో జోగులు ఓటమి ఖాయమని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను రాజాం నుంచి పాయకరావుపేటకు బదిలీ చేశారు. అక్కడి నుంచి ఎన్నికల బరిలో దించారు. కంబాల రాజవర్దన్ ఈసారి కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి బి-ఫారం తెచ్చుకుని పోటీ చేస్తున్నారు. రాజవర్దన్ తండ్రి కంబాల రాజరత్నం పాలకొండ నియోజకవర్గం నుంచి గతంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు.



కంబాల జోగులు




కంబాల రాజవర్దన్

పైసలు కావలె!

- సమీపిస్తున్న ఎన్నికల తేదీ
- ప్రతి కదలికా.. డబ్బుతోనే..





(రాజాం రూరల్)

జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా డబ్బు.. డబ్బు.. డబ్బు.. అనే మాట వినిపిస్తోంది. పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఎంత డబ్బున్నా చాలని పరిస్థితి కనిపిస్తోంది. పట్టుమని పది రోజులే ఉండడంతో అసలైన ఖర్చంతా ఇప్పుడే ప్రారంభం కానుంది. ప్రచార కార్యక్రమాలతో పాటు ఓటర్లను ఆకట్టుకునేందుకు కొంతమంది అభ్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ఎన్నికలలో ఎంత ఖర్చు చేస్తే అంత లాభిస్తుందన్న ఆలోచనతో అభ్యర్థులు వెనుకా ముందూ చూడడం లేదు. పైసలు లేనిదే అభ్యర్థులు ఇంటి నుంచి బయటకు కాలు పెట్టలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొంతమంది అభ్యర్థులు డబ్బును ముందస్తుగా సమకూర్చుకోగా.. మరికొందరు నాయకులు మాత్రం డబ్బు కోసం వెతుకులాట ప్రారంభించారు. ఖర్చు చేయడంలో కాస్త వెనుకంజలో ఉన్నారు.

నిఘా వల్ల ఇబ్బంది

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. నిఘా పెంచింది. అభ్యర్థుల ఖర్చులపై మూడోకన్ను తెరిచింది. ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించింది. బ్యాంకుల నుంచి చేసే లావాదేవీలపై కూడా కన్నేసింది. దీంతో అభ్యర్థులు, వారి స్నేహితులు, బంధువులు, అత్యంత నమ్మకస్తులతో ఆర్థికపరమైన లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. ఈసారి తేడా వస్తే ఇక ఇంతేనన్న భయం వారిని వెంటాడుతోంది. ఫలితంగా చావో రేవో ఈ ఎన్నికలలోనే తేల్చుకుందామనే ఆలోచన నెలకొంది. అవసరమైతే బంగారం, భవనాలు అమ్మేందుకు కూడా వెనుకాడని పరిస్థితి కొంత మంది అభ్యర్థుల్లో కనిపిస్తోంది. గెలిస్తే అంతకంత సంపాదించుకో వచ్చుననే ఆలోచనతో కొంతమంది ప్రయివేటు ఫైనాన్షియర్లపై ఆధారపడుతున్నారు. ఎన్నికల ముందురోజు అర్ధరాత్రి వరకూ డబ్బుతోనే అసలైన పని కాబట్టి ఓటర్లను ప్రలోభపెట్టెందుకు బహుమతులు, చీరలు, చిన్నపాటి వెండి వస్తువులు పంపిణీ చేసేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో పలుచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కు పట్టుబడుతున్న బంగారు, వెండి ఆభరణాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ప్రధానంగా పోలింగ్‌కు ఒకరోజు ముందు డబ్బుతో పాటు మందు బాటిళ్లు కూడా అందజేసేందుకు జిల్లాలో లిక్కర్ మాఫియా రంగంలోకి దిగింది. మద్యం షాపులు, బార్లలో క్వార్టర్ బాటిల్ కూడా దొరక్కపోవడానికి ఇదో కారణంగా తెలుస్తోంది.

రూ. 500 నోటే దిక్కు..

ఈసారి రూ.500 నోట్లు దిక్కుగా నిలవనున్నాయి. ఒకటికి బదులు నాలుగు నోట్లు ఇవ్వాల్సి రావడం... నగదు రవాణాలో కూడా ఈ నోట్లతో ఇబ్బందులు తలెత్తుతుండడం నాయకులకు శిరోభారంగా మారుతోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రూ.2 వేల నోటు హంగామా చేసింది. గత ఏడాది రిజర్వ్‌బ్యాంక్ రూ.2 వేల నోట్లు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం రూ.500 నోట్ల లావాదేవీలు పెరిగాయి. ఫలితంగా మార్కెట్లో వీటి సంఖ్య గత నెలరోజులుగా తగ్గుముఖం పడుతోంది. కేవలం రూ.200, రూ.100 ఎక్కువగా మార్కెట్లో కనిపిస్తున్నాయి.



ఓటును నేనండి.. నా కథ వినండి!


(చీపురుపల్లి)

నే'తల' రాతలు మార్చేది నేనే. పాలకులకు దిశా నిర్దేశం చేసేది నేనే. ప్రజాస్వామ్య మనుగడకి మూలం నేనే. అంతటి ప్రాధాన్యం ఉన్న నా చరిత్ర తెలుసుకోకుండానే అందరూ నా గురించి మాట్లాడేసుకుంటున్నారు. అసలు నేనెవరిని.. ఎలా పుట్టాను... శతాధిక వయోభారంలోనైనా నా గురించి నాలుగు మాటలు చెప్పని వ్వండి. నేను ఓటును. అసలింతకీ నా పుట్టుక ఎలా జరిగిందంటే... స్వాతంత్ర్యానికి పూర్వం.. 1907లో రాయల్ కమిషన్, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నా గురించి కొన్ని సిఫారసులు చేసింది. దాంతో 1909లో అమలులో ఉన్న కౌన్సిల్ చట్టం అప్పట్లో పరిమితంగా ఈ దేశ పౌరులకు తొలిసారిగా 'ఓటు'గా నన్ను పరిచయం చేసింది. 1919లో ఆ చట్టాన్ని మరింత విస్తృత పరిచారు. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా నన్ను వినియోగించు కొనే హక్కును 10.6 శాతం ప్రజలకు కల్పించారు. అనంతరం రాజ్యాంగ పరిషత్ ఎన్నికల సందర్భంగా దాన్ని 28.5 శాతానికి పెంచారు. బ్రిటిష్ కాలంలో అలా నా జీవన గమనం ప్రారంభమైంది. ప్రజాస్వామ్య సమానత్వ సూత్రాన్ని అనుస రించి ఒక వ్యక్తి... ఒక ఎన్నికలో... ఒకేసారి నన్ను ఉపయోగించే అవకా శం కల్పించారు. రాజ్యాంగంలోని అధికరణం 325 ప్రకారం కుల, మత, వర్గ, వర్ణ, జాతి, ప్రాంత, లింగ భేదాలు లే కుండా అందరూ నన్ను వినియోగించు కోవచ్చు.

- 1952లో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా 326 అధిక రణం కింద సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించారు.
- 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను వినియో గించేందుకు కనీస వయోపరిమితి ని 21 ఏళ్ల నుంచి 18కి తగ్గించింది.
- బ్యాలెట్ పత్రంపై స్టాంపుతో ఇంకు ముద్ర వేసే స్థాయి నుంచి మీట నొక్కి ఓటు వేసే స్థాయికి నన్ను చేర్చారు. ఇప్పుడైతే, ఎవరికి సపో ర్టుగా నన్ను వినియోగించారో కూడా తెలుసుకొనే వీవీ ప్యాట్స్ విధానాన్ని కూడా తెచ్చారు.

విన్నారు కదా... ఇదీ నా పూర్తి కథ. మరో పది రోజుల్లో.. అంటే ఈ నెల 13న నా పండగ జరుగబోతోంది. ఆ పండగలో మీరంతా పాలు పంచుకోవాల్సిందిగా ప్రతి ఒక్కరినీ పేరు పేరునా విజ్ఞప్తి చేస్తున్నాను. నాకున్న విలువను సరైన పద్ధతితో వినియోగించుకోవలసిందిగా కోరుతూ..

ఇట్లు
మీ ఓటు







ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు.. అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్

పవన్ పర్యటన ఇలా..

(పాలకొండ/సీతంపేట/వీరఘట్టం)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పాలకొండలో పర్యటించారు. స్థానిక వడమ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఆయన పర్యటన వివరాలు...

- సాయంత్రం 3.50 గంటలకు పాలకొండ, వీరఘట్టం రోడ్డులోని గజలాఖానా వద్ద హెలీప్యాడ్ వద్దకు పవన్ కల్యాణ్ చేరుకున్నారు. నేరుగా ప్రత్యేక వాహనంలోకి వెళ్లారు.
- సాయంత్రం 4.15 నుంచి 4:45 గంటల వరకు హెలీప్యాడ్ నుంచి రోడ్‌షో నిర్వహించారు.
- ఈ రోడ్డుషో వీరఘట్టం జంక్షన్, కోటదుర్గమ్మ ఆలయం, నాగవంశపువీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వడమ సెంటర్‌లోని సభాస్థలి వరకు సాగింది. సుమారు అరగంట పాటు సాగిన రోడ్‌షోకు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. పూలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆదరించారు. పెద్దఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.
- భారీ జన సందోహం నడుమ ఓపెన్‌టాప్ వాహనంలో అభివాదం చేస్తూ పవన్‌కల్యాణ్ సభాస్థలికి చేరుకున్నారు.
- భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు, అభిమానులతో రహదారులు కిక్కిరిశాయి. జనసేనానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జేజేలు పలికారు. మరోవైపు పవన్‌ను చూసేందుకు కొందరు రహదారికి ఇరువైపులా ఉన్న భవనాలు, చెట్ల మీదకు ఎక్కారు.



బస్సుపై నుంచి తిలకిస్తున్న అభిమానులు..



చెట్టు ఎక్కి ఇలా..

మండుటెండలో భోజనం

- ఎన్నికల సిబ్బందికి ఇక్కట్లు

రాజాం మే 2: ఎన్నికల సిబ్బందికి గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందికి మధ్యాహ్న భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే టెంట్లు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో మండుటెండలో నిలబడి భోజనాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు.



భోజనం కోసం మండుటెండలో..

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 3 మే 2024



పూసపాటి అశోక్‌గజపతి రాజు

విజయనగరం జిల్లాకు కళలు... విద్య పరంగానే కాదు.. రాజకీయంగానూ మంచి ప్రాముఖ్యం ఉంది. ఈ జిల్లా నుంచి అనేక మంది మంత్రులుగా బాధ్యతలు చేపట్టి... ఆ పదవులకు వన్నె తెచ్చారు.

ఇదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఆ తరువాత అనేక మంది వివిధ ప్రధాన శాఖలకు మంత్రులుగా వ్యవహరించారు. తమదైన శైలిలో పాలనపై ముద్ర వేశారు.



పతివాడ నారాయణ స్వామి నాయుడు



కోళ్ల అప్పలనాయుడు

మంత్రులుగా మనోళ్లు!

- ఎస్.కోట నుంచి ఏకంగా సీఎం పదవి
- ఆ తరువాత ఆ నియోజకవర్గానికి దక్కని మంత్రి యోగం
- సుదీర్ఘకాలం మంత్రులుగా అశోక్ గజపతిరాజు, బొత్స సత్యనారాయణ



(శృంగవరపుకోట)

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని వివిధ నియోజక వర్గాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో చాలా మందికి మంత్రి వర్గంలో చోటు దక్కింది. విజయనగరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పూసపాటి అశోక్‌గజపతిరాజు, చీపురుపల్లి నుంచి ఎన్నికైన బొత్స సత్యనారాయణలకు సుదీర్ఘ కాలం పాటు మంత్రులుగా చేసిన అనుభవం ఉంది.

మంత్రులుగా..

- విజయనగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన పూసపాటి అశోక్‌గజపతి రాజు సుదీర్ఘకాలం పాటు రాష్ట్ర మంత్రి వర్గంలో పని చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
- చీపురుపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొత్స సత్యనారాయణ మంత్రిగా ఎక్కువగా కాలం పనిచేశారు. ప్రస్తుతం ఆయనే జిల్లాకు మంత్రిగా ఉన్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కిమిడి మృణాళిని గతంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- బొబ్బిలి నియోజకవర్గం నుంచి ఎన్నికైన సుజయ్‌కృష్ణ రంగారావు, పెద్దింటి జగన్మోహన్‌రావు మంత్రి పదవులు అలంకరించారు.
- పార్వతీపురం నియోజకవర్గం నుంచి ఎన్నికైన శత్రుచర్ల విజయరామరాజు అటవీశాఖ మంత్రిగా పనిచేశారు. చీకటి పరశురాముడు పరిశ్రమల శాఖ మంత్రిగా కొంత కాలం ఉన్నారు.
- గజపతినగరం నియోజకవర్గం నుంచి గతంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన పడాల అరుణ రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు.
- సాలూరు నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే బోయిన రాజయ్య మంత్రి పదవి చేపట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు.
- రద్దయిన ఉత్తరాపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన కోళ్ల అప్పలనాయుడు దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇదే నియోజకవర్గం నుంచి పద్మనాభరాజు మంత్రి పదవి చేపట్టారు.
- భోగాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పతివాడ నారాయణ స్వామి నాయుడు చక్కెర శాఖ మంత్రిగా పనిచేశారు.
- రద్దయిన సతివాడ నియోజకవర్గం నుంచి అత్యధిక సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పెనుమత్స సాంబశివరాజు మంత్రి మండలిలో చోటు సంపాదించారు.
- వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు రద్దయిన తెర్లాం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై నీటి పారుదల, విద్యుత్ శాఖల మంత్రిగా సేవలు అందించారు.



టంగుటూరి ప్రకాశం పంతులు

ముఖ్యమంత్రిగా టంగుటూరి

ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన టంగుటూరి ప్రకాశం పంతులు శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. జిల్లా వాసి కానప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న సీవీ సోమయాజులు శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి ప్రకాశం పంతులుకు అవకాశం కల్పించారు. ఆ తరువాత ఈ శాసన సభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలెవరికీ మంత్రి యోగం దక్కలేదు.



పెద్దింటి జగన్మోహన్‌రావు



సుజయ్‌కృష్ణ రంగారావు



బొత్స సత్యనారాయణ



పడాల అరుణ



కిమిడి మృణాళిని



వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు



పెనుమత్స సాంబశివరాజు



పీడిక రాజన్నదొర



శత్రుచర్ల విజయరామరాజు

నిరక్షరాస్యులకు ఓటు హక్కు ఉండేది కాదు

మీకు తెలుసా?



విజయనగరం: రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు పొందే అవకాశం కల్పించింది. కుల, మత, వర్గ, లింగ, ధనిక, పేద, ప్రాంతాల కతీతంగా అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని రాజ్యాంగంలో పొందుపరిచారు. బ్రిటిష్ పాలనా కాలంలో కేవలం ప్రభుత్వోద్యోగులు, చదవడం, రాయడం వచ్చినవారు, భూస్వాములు, బ్రిటిష్ ఏలుబడిలో పనిచేసే సిబ్బందికి మాత్రమే ఓటుహక్కును కల్పించే వారు. ప్రధానంగా నిరక్షరాస్యులకు అసలు ఓటుహక్కు ఉండేది కాదు. దేశంలో 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల నుంచి అర్హులందరికీ ఓటుహక్కు కల్పించారు. 1952, 1957ల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు ప్రత్యేకంగా పోలింగ్ పెట్టెలను ఏర్పాటు చేసేవారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఆ డబ్బాలో ఓటు వేసే వారు. అనంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులు ఎంతమంది ఉన్నా ఒకే డబ్బాను కేటాయించి అందులో ఓటు వేసే విధానం అమల్లోకి తీసుకువచ్చారు.1962 నుంచి ప్రతి పోలింగ్ కేంద్రంలో అందరు అభ్యర్థులకు కలిపి ఒకే డబ్బాను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పత్రాలతో ఓటువేసే విధానం నుంచి నేడు ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలను వినియోగించే వరకూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు.

అభ్యర్థులూ.. ఆరోగ్యం పదిలం

- ప్రచారంలో జాగ్రత్తలు తప్పనిసరి

(విజయనగరం)



వేసవి ప్రారంభం నుంచీ ఈ ఏడాది భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తి పోతున్నారు. ప్రతిరోజూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనాలు భయపడుతున్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతోంది. దీంతో పోటీలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచార పర్వంలో మునిగి తేలుతున్నారు. అయితే, వారిని ఎండలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉదయం పది గంటలు దాటితే ఎండలు మండిపోతుండడంతో ప్రచారానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

- ఉదయం అభ్యర్థులు, మద్దతుదారులు అల్పాహారం తీసుకొని ప్రచారానికి వెళ్లాలి. ఖాళీ కడుపుతో ప్రచారంలో పాల్గొనరాదు. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటలు, సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రచారం చేయాలి. వీలైనంతవరకు ఎండలో తిరగరాదు.
- వాతావరణం చల్లగా ఉన్న సమయంలోనే ఇంటింటా ప్రచారం చేయాలి. ఎండలో ప్రచారం చేయడం తప్పనిసరైతే గొడుగులు వెంట తీసుకెళ్లాలి. అభ్యర్థులు, అనుచరులు తప్పకుండా గొడుగు, టోపీలను విధిగా ధరించి ఎండనుంచి ఉపశమనం పొందాలి.
- ప్రచారం సమయంలో ఎక్కడైనా చెట్ల కింద లేదా భవనాల వద్ద సేదతీరాలి. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ప్రచారంలో దిగాలి. చెమట రూపంలో లవణాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి. నీరు ఎక్కువగా తీసుకోవాలి. తమ వెంట నీళ్ల సీసాలు ఉంచుకోవాలి. ఓఆర్ఎస్, గ్లూకోజ్ వంటివి వెంట ఉంచుకోవాలి.
- మజ్జిగ తాగడం, కర్బూజ తీసుకోవడంతో ఉష్ణ తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. అంబలి, పండ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి శక్తిని, ఉత్సాహాన్నిస్తాయి.



- బయట శీతల పానీయాలు, ఎక్కడ పడితే అక్కడ నీళ్లు తాగవద్దు. చల్లదనంకోసం ఐస్‌క్రీములు తినవద్దు. మాంసం, వేపుడు కూరలు, నూనె పదార్థాలు తీసుకోకపోవడం మంచిది. మాంసకృత్తులు తీసుకోవడం వల్ల శరీరాన్ని నిస్సత్తువను చేసి ప్రచారంలో అలసటను తెస్తుంది. సాధ్యమైనంత వరకు శాఖాహారం తీసుకోవాలి.
- మద్యం, ధూమపానం మానేయడం ఆరోగ్యానికి మంచిది. కాఫీలు, టీలు కూడా తాగకపోవడం ఉత్తమం.
- రాత్రివేళ ఆహారం తక్కువగా తేసుకుంటే ఉదయం ఉత్సాహంగా ఉంటారు.
- వేసవిలో కలుషిత నీరు, కలుషిత ఆహారంతో అతిసారం, కామెర్లు, టైఫాయిడ్, వడదెబ్బ తదితర జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.
- కాచిచల్లార్చిన నీటిని వడకట్టి తాగాలి. నీటిని శుభ్రపరచడానికి బిందెడు నీటిలో ఒక క్లోరిన్ బిళ్లను వేసి అరగంట తర్వాత తాగాలి.
- మల, మూత్ర విసర్జనల అనంతరం, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- నిమ్మరసంలో ఉప్పు మిశ్రమాన్ని కలిపి తాగాలి.
- ఎండలో తిరగడం వల్ల తొందరగా అలిసిపోవడంతో పాటు విరేచనాలు అవుతాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.



చీపురుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో జనసందోహం

బాలయ్యకు ఘన స్వాగతం



బాలకృష్ణతో జనసేన పార్టీ నాయకులు



ఫొటోలు తీస్తున్న బాలయ్య అభిమానులు

'స్వర్ణాంధ్ర సహకార యాత్ర'లో భాగంగా సినీ నటుడు, హిందూపురం నియోజకవర్గ శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ గురువారం చీపురుపల్లి, విజయనగరంలో పర్యటించారు. ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఆయనకు స్థానికులు, అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయనను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్డు షోకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు.



విజయనగరంలో బాలకృష్ణ రోడ్ షో..



కళా వెంకటరావుతో బాలకృష్ణ మాటామంతీ

వైసీపీకి బుద్ధిచెప్పాలి

● రాజాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

రాజాం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. గురువారం స్థానిక శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో రేగిడి మండలంలోని లక్ష్మీపురానికి చెందిన మీసాల చక్రధరరావు, చంద్రినాయుడు, మహేశ్వరరావు, భాస్కరరావు, నాగభూషణ, లెంక చిరంజీవి, గోవిందా కృష్ణ, సింహాచలం తదితర 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, గౌరినాయుడు, గురవాన నారాయణరావు పాల్గొన్నారు. కాగా రాజాం మునిసిపాలిటీ పరిధిలోని మెంతిపేట ఎస్సీ కాలనీలో కోండ్రు మురళీమోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

●రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను గెలిపిస్తే మత్స్యకారులకు భవిష్యత్ ఉంటుందని మత్స్యకారసంఘం అధ్యక్షుడు బెహరా తవుడు తెలిపారు. వంగర, సంతకవిటి, రాజాం మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రచారంచేశారు.

●**రేగిడి:** ఖండ్యాంపంచాయతీలో ఉపాధి పనులుచేస్తున్నవేతనదారులకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు బట్న సూర్యనారాయణ, టీడీపీనేత గొలివి హరి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు.

●**వంగర:** మద్దువలస, జగన్నాథవలస, మగ్గూరు. ఓనిలో రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసుదేవరావు నాయుడు, పైల వెంకటరమణ, మోహనరావు, కృష్ణమూర్తి, ధనలక్ష్మి, రవి, శ్రీను పాల్గొన్నారు.


రాజాం: పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న కోండ్రు మురళీమోహన్

అన్నిరంగాల్లో జగన్ ప్రభుత్వం విఫలం

● విజయనగరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు


16వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అతిది గజపతిరాజు

విజయనగరం రూరల్: సీఎం జగన్ ప్రభుత్వం పాలనలో అన్నిరంగాల్లో విఫలమైందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితిగజపతిరాజు ఆరోపించారు.గురువారం విజయనగరం కార్పొరేషన్‌లోని 16వ డివిజన్‌పరిధిలోని అంబటిసత్తర్వు, అశోక్‌నగర్, రింగురోడ్డు జంక్షన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీలో 500 కుటుంబాల చేరిక

విజయనగరం కార్పొరేషన్‌లోని మూడోడివిజన్ కార్పొరేటర్ వజ్రపు సత్యగౌరీ, ఆమె భర్త వజ్రపు శ్రీనివాసరావు, జి.రమణ, బర్నాల సంతోష్, దువ్వ శ్రీనుతోపాటు 500 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి.ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలోబీసీకాలనీకి చెందిన మజ్జి బాబురావు, పడగల రమణ, మజ్జి రమేష్, మజ్జి శ్రీనివాసరావుతోపాటు, విజయనగరం మండలంలోని బడుకొండపేట ప్రాంతానికి చెందిన పతివాడ శంకరరావు, పతివాడ సత్యం, కర్రోతు రామస్వామితో పాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. రీమాపేట ప్రాంతానికి చెందిన బీఎస్ఎన్ రామరాజుతోపాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కంది మురళీనాయుడు,కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్‌కుమార్, గౌరీశంకర్, అవనాపు విజయ్ పాల్గొన్నారు.

జనసేన గెలుపు ఎంతో అవసరం

● కూటమి నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి


మాట్లాడుతున్న లోకం నాగమాధవి

భోగాపురం: నెల్లిమర్ల నియోజకవర్గానికి జనసేన పార్టీ గెలుపు ఎంతో అవసరమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని సవరవల్లి, కవులవాడ, తూడెం, మరాడ పాలెం, చెరుకుపల్లి, గుడివాడ గ్రామాల్లో ఆమె గురువారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని విధాలా వెనుకబడి ఉందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించగలిగితే యువతకు, మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తద్వారా ఆర్థిక స్వావలంబన సాధించుకోవచ్చు అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ, పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, మట్టా అయ్యప్పరెడ్డి, వందనాల రమణ, టీడీపీ కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు. కాగా భోగాపురం మండలంలోని ముంజేరు, రాజాపులోవ, పూసపాటిరేగ మండలంలోని పతివాడ గ్రామాలకు చెందిన 100 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వీరంతా ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు లోకం ప్రసాదు ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

● **రాజాం:** నెలిమర్ల నియోజకవర్గంలో జనసేన తరపున పోటీ చేస్తున్న లోకం మాధవిని తెలగ కులస్థులు గెలిపించాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి నంది సూర్యప్రకాష్‌రావు కోరారు.రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ మాధవిని గెలిపిస్తే రాష్ట్రంలోనే తెలుగ కులస్థులకు గుర్తింపును రావడంతోపాటు సంఘ సమస్యలు పరిష్కారానికి తోడ్పాటు లభిస్తుందని తెలిపారు.

కూటమి మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజల అభ్యున్నతి: వనజాక్షి


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న వనజాక్షి

నెల్లిమర్ల: కూటమి మేనిఫెస్టో ప్రజల అభ్యున్నతికి కీలకంగా దోహదపడుతుందని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి అన్నారు. కూటమి మేనిఫెస్టోపై హర్షం వ్యక్తంచేస్తూ గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమి అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చిల్లా పద్మ, పార్టీ జిల్లా కార్యదర్శి లెంక హైమావతి, అధికార ప్రతినిధి కింతాడ కళావతి, నగర పంచాయతీ మహిళా అధ్యక్షురాలు రెడ్డి సంతోషి, నెల్లిమర్ల మండల మహిళా అధ్యక్షురాలు యడ్ల లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వరం: రాజశేఖర్

నెల్లిమర్ల: కూటమి అధినాయకులు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలు, మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలకు వరం అని టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుకు మద్దతుగా రామతీర్థం, తంగుడుబిల్లి తదితర గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, రామతీర్థం మాజీ సర్పంచ్ తాడ్డి సత్యనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు నల్లం శ్రీనివాసరావు, జనసేన మండల కోఆర్డినేటర్ కరుమజ్జి గోవింద్ పాల్గొన్నారు.

వేసవిశిక్షణ శిబిరం ప్రారంభం

రాజాం రూరల్: రాజాంలోని వికాసతరంగిణి కార్యాలయంలో ఆ సంస్థ నిర్వాహకుడు టీటీవీ రమణమూర్తి వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు ఈనెల 11 వరకు శ్లోకాలు, యోగాసనాలు, నీతికథలు, పద్యాలు, రుషుల జీవిత చరిత్రలు, మన పండుగల ప్రత్యేకతలను వివరించనున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి-గొట్లాం గ్రామాల మధ్యనగల రైల్వే ట్రాకుపై గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ట్రాకు దాటుతుండగా గానీ, రైలు ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గానీ సుమారు 30ఏళ్లు ఉన్న వ్యక్తి పట్టాల మధ్య మృతిచెందాడని రైల్వే పోలీసుస్టేషన్ హెచ్‌సీ బి.కృష్ణారావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించగా, మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదని చెప్పారు. మృతుడు నలుపు, ఎరుపురంగు చారల అడ్డగీతల షర్టుతోపాటు సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించామని, మృతుడి ఆచూకీ తెలిసినవారు రైల్వే ఎస్ఐ పి.రవివర్మను 9490617089, హెచ్‌సీ కృష్ణారావు 9441013330 నెంబర్ల సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడు..


రామకృష్ణ రాజు (ఫైల్)

గుర్ల: ఆనందపురం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లూరి రామకృష్ణరాజు(53) రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కూటమి అభ్యర్థి ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం మధ్యాహ్నం మెరకముడిదాం బయలుదేరారు. తమ గ్రామం నుంచి బైకుపై గుర్ల వెళ్తుండగా కలవచర్ల సమీపంలో ఉన్న దొంగలకోనేరు సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడ్డారు. తీవ్ర గాయాలైన ఆయనను విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన బీజేపీ మండల అధ్యక్షుడిగా, జిల్లా స్థాయిలో ప్రధాన కార్యదర్శిగా, కార్యవర్గ సభ్యుడుగా పలు పదవులను అలంకరించారు. ఈయన మృతికి టీడీపీ, బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం

గుర్ల: చోడవరం గొల్లవీధి సమీపంలో గురువారం రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.50వేలు ఆస్తినష్టం జరిగినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

20 ఎకరాల్లో నీలగిరి తోట..

వేపాడ: వెల్దాంసమీపంలో గురువారంజరిగిన అగ్నిప్రమాదంలో గ్రామంలోని పచ్చికూర వెంకటరమణకు చెందిన సుమారు 20 ఎకరాల్లో నీలగిరి తోట దగ్ధమయ్యింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అగ్నిమాపకకేంద్రానికి సమాచారం ఇవ్వడంతో శకటంతో సిబ్బంది చేరుకుని మంటలు అదుపుచేశారు. ప్రమాదం ఎలా సంబవిం చిందో తెలియలేదని స్థానికులు చెబుతున్నారు.

15.6 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైం: విజయనగరంలోని రైల్వేస్టేషన్ పరిధిలో కిరండోల్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15.6 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు తెలిపారు. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఆదేశాలతో ఎన్నికల నేపథ్యంలో రైళ్లలో తనిఖీలు చేపట్టగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశోక్ గంజాయితో పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు అశోక్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.తనిఖీల్లో జీఆర్పీ విజయనగరం ఎస్ఐ రవి వర్మతోపాటు సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. అలాగే విజయనగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోటపాలెం బ్యాంక్ కాలనీలో ఢిల్లీ, నోయిడాకు చెందిన షేర్, గౌరవ్ రజోనియ అదుపులోకి తీసుకుని 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు. వీరిద్దరూ గంజాయితో రైల్వేస్టేషన్ వైపు వెళ్తుండగా, పోలీసులు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా పట్టుబడ్డారని చెప్పారు. దాడుల్లో ఎస్ఐ హరిబాబు నాయడు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరంలో పీవీజీ రాజు శతాబ్ది ఉత్సవాలు

విజయనగరం దాసన్నపేట: మాన్సాస్ సంస్థలను సమాజాభ్యున్నతి కోసం ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నామని మాన్సాస్ చైర్మన్,కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తెలిపారు. గురువారం విజయనగరంలోని కోటలో రాజాసాహేబ్ డాక్టరు పీవీజీ రాజు జయంతి, శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ తన తండ్రి ఏర్పాటు చేసిన విద్యా సంస్థలవల్ల నేడు ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నతస్థాయిలో నిలిచారన్నారు. విజయనగరం చివరి మహారాజు పేరిటి రూపొందించిన పుస్తకాన్ని అశోక్‌గజపతిరాజు, ఏవీడీ శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టరు ఏవీడీ శర్మ,సునీలా గజపతిరాజు, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విద్యావతిదేవితో పాటు పీవీజీ రాజు బంధువులు, గీతా రామస్వామి, శశికుమార్, కేవీఎల్ రాజుతోపాటు పాల్గొన్నారు.అలాగే స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో పీవీజీ రాజు శతజయంతిఉత్సవాలను క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్ గజపతి రాజు, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ,ఎంఎస్ఎన్ రాజు, రామరాజు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుచేస్తే చర్యలు : ఎంపీడీవో

లక్కవరపుకోట: ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కె.రూపేస్ తెలిపారు. గురువారం జమ్మాదేవిపేటలో నెక్కల కట్టుచెరువు, కొత్తబందలో ఉపాధిపనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంచేశారు.ఈసీనిబంధనల మేరకు పనిచేస్తున్న సమయంలో కూలీలవద్దకు వెళ్లి అనుమతిలేకుండా ప్రచారం చేయరాదు. కాగా ఉపాధి పనుల వద్ద ప్రచారానికి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని ఎంపీడీవో తెలిపారు. ఆధారాలతో కూడిన ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జగన్ గెలిస్తే మన భూములు ఉండవు: కోళ్ల

జామి: మరోసారి జగన్‌గెలిస్తే మన భూములు, ఇళ్లు ఇక మనకు ఉండవని, అటువంటి ల్యాండ్ యాక్ట్‌ను వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి తెలిపారు. గురువారం రామయ్యపాలెలో టీడీపీ విశాఖ పార్లమెంట్ మహిళ ప్రతినిధి మాకిరెడ్డి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిరాంప్రసాద్, పెదబాబు, లగుడు రవికుమార్ పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** ఎస్.కోటలోని రెల్లి,కాపు, బ్రాహ్మణ, తెలకల వీధుల్లో లలితకుమారి ప్రచారం చేశారు.కార్యక్రమంలో హాషితనాయుడు, సర్పంచ్‌లు కోళ్ల భూపాల్ నాయుడు, సంతోషికుమారి, కొణదం మల్లేశ్వరరావు పాల్గొన్నారు. ●**వేపాడ:** వేపాడలో టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, ఎంపీటీసి గొంప తులసి ఎన్నికల ప్రచారం చేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: బేబీనాయన


టీడీపీ కండువావేసి ఆహ్వానిస్తున్న బేబీనాయన

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని బొబ్బిలి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి బేబీనాయన తెలిపారు. గురువారం ఇట్లామామిడిపల్లి, సోంపురం, చింతలవలస, మర్రివలసల్లో ఎన్నికల శంఖారావంసభలు నిర్వహించారు. కాగా ఇట్లామామిడిపల్లికి చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, చింతల రామకృష్ణ, మడక తిరుపతిరావు పాల్గొన్నారు.

● **బాడంగి:** ఎరుకులపాకలు, లక్ష్మీపురంల్లో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలవలస పార్వతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఆగవు: కళా


మాట్లాడుతున్న కళా వెంకటరావు

గుర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు ఆగవని చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు స్పష్టం చేశారు. పాలవలస, పున్నపురెడ్డిపేటల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు త్రిమూర్తులు, రాజు, కిరణ్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 40 కుటుంబాల చేరిక

గజపతినగరం: కొనిసలో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. స్థానిక టీడీపీ నాయకుడు శీరంరెడ్డి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన గంగచోళ్లపెంట, కొత్తబగ్గాం, చిట్టయ్యవలస, మర్రివలసల్లో ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు గోపాలరాజు, గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్ పాల్గొన్నారు.

●**డెంకాడ:** చొల్లంగిపేట పంచాయతీ గువ్వపేటలో సుమారు 20కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. డెంకాడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలోమాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ రావు, మాజీ జడ్పీటీసీ అప్పలనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు పల్లె భాస్కరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలోకలిదిండి పాణిరాజు, జగదీష్, రంగరాజు పాల్గొన్నారు.

పైడిమాంబ హుండీ లెక్కింపు

విజయనగరం రూరల్: విజయనగరంలోని శివాలయం వీధిలోని పైడిమాంబ కల్యాణ మండపంలో పైడిమాంబ చదురుగుడి హుండీని గురువారం లెక్కించారు. 34 రోజులకు గాను రూ.13,14,277 ఆదాయం వచ్చింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు లెక్కించారు.

ఎన్నికల్లో పీవోలదే కీలకపాత్ర: కలెక్టర్

రాజాం రూరల్: ఎన్నికల్లో పీవోలదే కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.గురువారం రాజాంప్రభుత్వోన్నత పాఠశాలలో పీవోలకు మూడోవిడత శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రాజాం నియో జకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్, తహసీల్దార్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్: ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుచేసి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ నాయకులుకోరారు. డీఆర్వోకు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

కంట్రోల్ రూము పరిశీలన

కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమును జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు హనీష్ ఛాబ్రా గురువారం పరిశీలించారు. వివిధ విభాగాల ఇన్‌చార్జిలతో మాట్లాడారు. ఆయన వెంట డీఆర్వో ఎస్‌డీ అనిత, కంట్రోల్ రూం ఇన్‌చార్జి పి.బాలాజీ,ఆయా విభాగాల ఇన్‌చార్జి అధికారులు,సిబ్బంది ఉన్నారు.

● **గజపతినగరం:** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులను ఎన్నికల పరిశీలకుడు హనీష్‌చాబ్రా పరిశీలించారు. ఆయన వెంట ఆర్వో సూర్యకళ, తహసీల్దార్ రమేష్ ఉన్నారు.

● **నెల్లిమర్ల:** నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను హనీష్ చాబ్రా పరిశీలించారు. ఆర్వో నూకరాజు, సహాయ రిటర్నింగ్ అధికారి ధర్మరాజు ఉన్నారు.

నేడు గుర్తుల లోడింగ్

బొబ్బిలి: బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆర్వో,ఆర్డీవో ఎ.సాయిశ్రీ తెలిపారు. గురువారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ బెల్‌ఎలక్ట్రానిక్ కంపెనీ పర్యవేక్షణలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంల్లో గుర్తులను లోడింగ్ చేసి, బ్యాలెట్లను అమర్చనున్నట్లు చెప్పారు. అనంతరం వెయ్యి వరకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: అమటాంరాయవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఏఈ ఎస్‌కే మస్తాన్‌వల్లి తెలిపారు. దీంతో ఎ.రాయవలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, చాకివలస గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

రేపు కొండవెలగాడ పరిధిలో..

నెల్లిమర్ల: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పారసాం, కొండవెలగాడ ఫీడర్ల పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.